వేధిస్తున్న పార్కింగ్ సమస్య

- అప్పనపల్లి ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు
- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్
- తరచూ ట్రాఫిక్‌జామ్


అప్పనపల్లిలో ప్రధాన రోడ్డు పక్కనే పార్కింగ్ చేసిన వాహనాలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులను పార్కింగ్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలం లేక పోవడంతో ఆలయం పక్కనే ఉన్న ప్రధాన రోడ్డుపై భక్తులు తమ వాహనాలను నిలిపి వేస్తున్నారు. దీంతో తరచూ తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. భక్తులు తమ వాహనాలు నిలుపుకునేందుకు అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేయడంలో అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఎంతో కాలంగా ఈ సమస్య వేధిస్తున్నా దీన్ని పరిష్కరించే తీరిక అటు అధికారులకు కానీ, ఇటు ప్రజా ప్రతినిధులకు కానీ లేదని భక్తులు తీవ్రంగా మండి పడుతున్నారు. దీంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ అన్న విధంగా వాహనాల పరిస్థితి తయారైంది.

పర్వదినాల్లోనూ ఇబ్బందే..

అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందింది. ఉచిత నిత్యాన్న దానానికి రాష్ట్రంలో తొలిసారిగా నాంది పలికిన ఈ ఆలయానికి పర్వదినాలతో పాటు ప్రతి శని, ఆదివారాలు, శ్రావణ, కార్తిక మాసాల్లో భారీ సంఖ్యలో భక్తులు వస్తున్నారు. ప్రతి శనివారం, ఆదివారం నాలుగు వేలకు పైగా భక్తులు ఈ ఆలయానికి వస్తున్నారు. స్వామి వారి కల్యాణోత్సవాలు, ఉత్తరద్వార దర్శనం వంటి పుణ్యదినాల్లో ఆ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పది వేలు దాటుతోంది. ఈ ఆలయంలో భక్తులకు వాహనాల పార్కింగ్ పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్య పరిష్కారంపై ఏ ఒక్కరికీ శ్రద్ధ లేకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. దీనిపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

వాహనాల పార్కింగ్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఈ సమస్య పరిష్కారం దిశగా కార్యాచరణ చేపట్టాం. రోడ్డు పక్కనే వాహనాలు నిలిపి వేయడం వల్ల తరచూ ట్రాఫిక్ నిలిచి పోవడంతో పాటు భక్తులు ఎన్నో ఇబ్బందులు పడుతున్న సమస్య మా దృష్టికి వచ్చింది. సాధ్యమైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని కృషి చేస్తున్నాం. గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో సాధ్యమైనంత త్వరగా వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరిస్తాం.

– సత్యనారాయణరాజు, ఈఓ, అప్పనపల్లి

పొంగి పొర్లుతున్న డ్రైనేజీ


డైలీ మార్కెట్ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

అంబాజీపేట: స్థానిక డైలీ మార్కెట్ రోడ్డులో డ్రైనేజీ పొంగి పొర్లి మురుగునీరు చెరువును తలపిస్తుంది. ఆ మురుగునీటి నుంచి దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలకు నిలయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజుల నుంచి డ్రైనేజీ నుంచి మురుగునీరు రోడ్డు పైకి వచ్చేస్తుందని పారిశుధ్య పనులు చేపట్టి, డ్రైనేజీని శుభ్రం చేయించాలని మాచవరం పంచాయతీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. మురుగునీరు రోజుల తరబడి రోడ్డుపై నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా ఏ రోగం వస్తుందోనని భయాందోళనకు గురవుతున్నామని నివాస ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అటుగా వెళ్లే మెట్లకాలనీ వాసులు మురుగు నీటిలోనే వెళ్లాల్సి వస్తుందని పంచాయతీ వారు పట్టించుకోకపోవడం దారుణమని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా డ్రైనేజీలో పూడికను తొలగించి మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీనివాసా.. గోవిందా... శ్రీవేంకటేశా గోవిందా


ఇసుకపూడిలో వేంకటేశ్వరస్వామి

అంబాజీపేట: శ్రీనివాసా గోవిందా... శ్రీవేంకటేశా గోవిందా అంటూ భక్తుల నామస్మరణ మధ్య వెంకన్న కల్యాణం మంగళవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. మండలంలోని ఇసుకపూడి జక్కంశెట్టివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూసమేత వేంకటేశ్వర స్వామి వారి దివ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణ నడుమ శ్రీనివాసుని కల్యాణాన్ని భక్తులకు కళ్లకు కట్టినట్లు చూపించారు. అంతకుముందు స్వామి వారికి సాహిత్య విద్యా ప్రవీణ సుసర్ల బుజ్జి, ఆలయ అర్చకుడు ఖండవిల్లి వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో గుత్తుల సత్యనారాయణ, వెంకటరమణ, పితాని వెంకటేశ్వరరావు, వెంకటరమణ, మట్టపర్తి సత్యనారాయణ, మనోహరం, నామాల ఏడుకొండలు దంపతులచే స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు.

క్లుప్తంగా

నవోదయకు విద్యార్థుల ఎంపిక


నవోదయకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవోలు

సఖినేటిపల్లి: మండలంలోని ఉయ్యూరువారి మెరక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న చెల్లుబోయిన రామ్‌రోహిత్, గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న మేడిచర్ల లోకేష్ సాయి నవోదయ ప్రవేశ పరీక్షల్లో ఎంపికయ్యాడు. ఈ మేరకు బుధవారం సదరు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఇరువురు విద్యార్థులను ఎంఈఓ-1 డి.కిషోర్ కుమార్, ఎంఈఓ-2 మద్దాలి వెంకటేశ్వరరావులు అభినందించారు. పాఠశాలల హెచ్‌ఎంలు సీహెచ్ జయలక్ష్మి, జె శ్రీనివాసరావు, టీచర్లు బి.నాగమల్లేశ్వరరావు, జి.నరేష్, తల్లిదండ్రులు సీహెచ్ రామ్‌వెంకటశెట్టి, ఎం.ఆదినారాయణ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


మాచవరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని పరీక్షలు చేయించుకోవాలని వైద్యుడు సూర్యనగేష్ అన్నారు. మాచవరం సచివాలయం-4 ప్రాథమిక పాఠశాల, ఇటికాలమ్మ ఆలయం సమీపంలో ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంను సీహెచ్‌ఓ బి.అప్పారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే వేసవిలో తీసుకోవల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు, కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సూర్యకుమారి, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు కోఆర్డినేటర్ పరామర్శ


వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న శ్రీనివాసరావు

అంబాజీపేట: అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తొండవరం గ్రామ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మద్దింశెట్టి వెంకటేశ్వరరావును జెడ్పీటీసీ, పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మనోధైర్యం కల్పించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కన్వీనర్ విత్తనాల ఇంద్రశేఖర్, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, కొర్లపాటి కోటబాబు, గోసపంగి కుమారస్వామి, మట్టపర్తి హరి, కాండ్రేగుల నాగబాబు, సూదాబత్తుల రాము, మద్దింశెట్టి మల్లిబాబు తదితరులు ఉన్నారు.

దర్శన టిక్కెట్ పెంపుపై నిరసన

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర తీర్థ ఈనెల 28న ప్రారంభం కానున్నాయి. అయితే ఆలయ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా అమ్మవారి దర్శనం టిక్కెట్‌ను రూ.100 వరకూ పెంచింది. గత కొన్నేళ్ల నుంచి ఉచిత దర్శనంతో పాటు రూ.10, రూ.50 వరకూ దర్శనం టిక్కెట్లు మాత్రమే ఉండేవి. ఈ ఏడాది మాత్రం టిక్కెట్ ధరను రెట్టింపు ధరకు పెంచడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోస్తా జిల్లాల నలుమూలల నుంచి వచ్చే సామాన్య భక్తులకు దర్శనం టిక్కెట్ ధర పెంపు అశనిపాతంలా మారింది. దీనిపై ఈవోను వివరణ కోరగా డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకే పెంచినట్టు తెలిపారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

ఆలమూరు: స్థానిక నాగుల చెరువుగట్టుమీద కొలువైన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఈ కల్యాణాన్ని తిలకించేందుకు మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరై కనులారా వీక్షించారు.

పది లీటర్ల సారా స్వాధీనం

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సోమవారం 1800 లీటర్ల బెల్లపుఊటను కనుగొని ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఎక్సైజ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక సమీప గోదావరి లంకలో దాడులు నిర్వహించారు. సారా తయారీకి ఉపయోగించే మూల ద్రవం 1800 లీటర్ల బెల్లపుఊట నిల్వ ఉంచిన ప్లాస్టిక్ పీపాలను గుర్తించారు. వాటిని వెలికితీసి, వాటిలో ఊటను ధ్వంసం చేశారు. 5 కేజీలు అమ్మోనియా, 10 లీటర్లు సారాను స్వాధీనం చేసుకున్నారు.

తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు


చంద్రరావు, కళావతి దంపతులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు, భాస్కర్ కుటుంబ సభ్యులు

కొత్తపేట: సమాజంలో ప్రతి ఒక్కరికి తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక బొరుసువారి సావరం విజయకనకదుర్గాదేవి ఆలయం పునర్నిర్మాణకర్త, సమాజ సేవా తత్పరుడు బొరుసు వెంకట ఉదయ భాస్కర్ తన తల్లి పూర్ణచంద్రకళావతి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని, ఈ సందర్భంగా తన వ్యవసాయ క్షేత్రం, ఫాంహౌస్‌లో నిర్మించిన ప్రేమ మందిరం, తల్లిదండ్రులు పూర్ణచంద్రకళావతి, చంద్రరావు దంపతుల కాంస్య విగ్రహాల ఆవిష్కరణ బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, శాసనమండలి మాజీ డిప్యూటీ స్పీకర్ రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. చంద్రరావు, కళావతి విగ్రహాలకు వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అమ్మ తమూర్తులు తల్లిదండ్రులన్నారు. కని పెంచడంతో పాటు బిడ్డల ఉన్నత భవిష్యత్ కోసం అహర్నిశలు శ్రమించే నిత్య కార్మికులు అమ్మానాన్నలని అన్నారు. తమలా బిడ్డలు కష్టపడకూడదని ఆకాంక్షతో తపిస్తూ పెంచి పెద్దచేస్తారన్నారు. అటువంటి అమ్మా, నాన్నలను అవసాన దశలో కంటికి రెప్పలా చూసుకోవాలని అన్నారు. ఆ విధంగా తన తల్లిదండ్రులను వారి కడవరకూ చూసుకోవడమే కాక వారిని నిరంతరం చూసుకునేలా తల్లిదండ్రుల కాంస్య విగ్రహాలు నెలకొల్పి, ఆరాధ్య మందిరాన్ని నిర్మించిన భాస్కర్ ఆదర్శ కుమారుడు, అభినందనీయుడని కొనియాడారు. అనంతరం విగ్రహాలను సజీవ శిల్పాలుగా మలిచిన స్థానిక ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్‌వుడయార్‌ను భాస్కర్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సత్యానందరావు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, రాష్ట్ర టీడీపీ నాయకుడు ఆకుల రామకృష్ణ, పశ్చిమగోదావరి జిల్లా కాపునాడు సీనియర్ నాయకుడు కరాటం రాంబాబు, సర్పంచ్ బూసి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పథకంలో 69 స్కూళ్ల ఎంపిక


మామిడికుదురులో ఎంఈఓతో చర్చిస్తున్న సీఎంఓ సుబ్రహ్మణ్యం


మామిడికుదురు: కోనసీమ జిల్లాలో పీఎంశ్రీ పథకంలో బెంచ్ మార్కుగా 69 స్కూళ్లను ఎంపిక చేశారని జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆయన మామిడికుదురులో పీఎం శ్రీ పథకంపై ఎంఈఓ మోకా వెంకన్నబాబు, పెదపట్నంలంక జెడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎం కె.హరనాథ్‌తో బుధవారం సమీక్ష నిర్వహించారు. పీఎంశ్రీ పథకంలో మామిడికుదురు మండలం పెదపట్నంలంక జెడ్పీహెచ్ స్కూల్‌ను ఎంపిక చేశారన్నారు. పీఎంశ్రీ పథకానికి ఎంపికైన స్కూల్స్‌కు అవసరమైన సదుపాయాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు.

ఈ పథకం ద్వారా ఆయా స్కూళ్లకు సైన్స్ ల్యాబొరేటరీ, లైబ్రరీ, రన్నింగ్ ట్రాక్, షటిల్, వాలీబాల్ కోర్టులు, కంప్యూటర్ ల్యాబ్, అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో పాటు స్కూల్‌కు అవసరమైన అదనపు భవనాల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు నిధులు మంజూరవుతాయన్నారు. మొదటి విడతలో కోనసీమ జిల్లాలో 21 హైస్కూల్స్, రెండో విడతలో అయిదు స్కూళ్లను ఎంపిక చేసి వాటికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నారని చెప్పారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెం కమ్యూనిటీ భవనంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గురువారం ఉదయం నిర్వహిస్తున్నట్లు రామ్‌చరణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో కార్డియాలజీ, అర్థోపెడిక్, ఆప్తమాలజీ, జనరల్ మెడిసిన్ తదితర వాటిని పరీక్షిస్తారన్నారు.

నూకాలమ్మ జాతర నేడు


నూకాలమ్మ

మామిడికుదురు: గ్రామ దేవత నూకాలమ్మ జాతర గురువారం రాత్రి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ బుధవారం తెలిపింది. జాతర మహోత్సవం ఏప్రిల్ ఒకటో తేదీ మంగళవారం వరకు ఆరు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి జాతర, శుక్రవారం అమ్మవారికి భక్తులు నైవేద్యాలు చెల్లిస్తారని, ఆదివారం అమ్మవారి సన్నిధిలో ఉగాది పండగ, పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశామని, శని, ఆది, సోమవారాలు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో మహా అన్న సమారాధన, మంగళవారం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందన్నారు. జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ భారీగా ఏర్పాట్లు చేసింది.

నూకాంబిక ఉత్సవాల సేవా కమిటీ ఏర్పాటు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక జాతర, తీర్థ మహోత్సవాల నిర్వహణకు సేవా కమిటీని నియమిస్తూ రాష్ట్ర దేవదాయ కమిషనరేట్ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పాలకవర్గం లేకపోవడంతో జాతర ఉత్సవాలకు 19 మంది సభ్యులతో నియమించిన కమిటీ ఈనెల 28 నుంచి ఏప్రిల్ 27 వరకు అమలులో ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సేవా కమిటీ సభ్యులుగా పలువురిని నియమిస్తూ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులను వెలువరించినట్లు ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి బుధవారం విలేకరులకు తెలిపారు.

పాస్టర్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

సఖినేటిపల్లి: హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల మృతి ఘటన రోడ్డు ప్రమాదం కాదని, అనుమానాస్పద మృతి అంటూ నిరసన వ్యక్తం చేస్తూ క్రైస్తవ సంఘాలు, పాస్టర్లు, విశ్వాసులు బుధవారం సఖినేటిపల్లిలో నిరసన తెలిపారు. తొలుత స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దకు అధిక సంఖ్యలో తరలి వచ్చిన సఖినేటిపల్లి, మలికిపురం మండలాలకు చెందిన వారంతా అక్కడే పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టి, ఆందోళన చేశారు. క్రైస్తవులకు రక్షణ కల్పించాలని, హక్కులు కాపాడాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఆయన మృతిపై సీబీఐ ఎంక్వయిరీ వేయాలని అంటూ ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

కొత్త కోర్సులపై విద్యార్థుల ఆసక్తి

రాజోలు: కొత్త కోర్సులపై విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని, దానికి అనుగుణంగా డిగ్రీ కళాశాలల్లో కొత్త కోర్సులు నిర్వహించాలని రాజమహేంద్రవరం ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శోభారాణి అన్నారు. బుధవారం ఆమె రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటాలని సూచించారు. అలాగే కళాశాల లైబ్రరీలో క్యూఆర్ కోడ్ విధానం విద్యార్థులకు మేలు చేస్తుందన్నారు. కళాశాలకు విచ్చేసిన శోభరాణికి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు ఘనంగా స్వాగతం పలికారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, పీఆర్వో నల్లి రాజు, డాక్టర్ చంద్రబోస్, శైలజ, అశ్వనిరెడ్డి, సరిత తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

ఆలమూరు: మండలంలో వివిధ చోట్ల నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా ప్రత్యేక తనిఖీ అధికారి ఎం.రామలింగం బుధవారం తనిఖీ చేశారు. మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో ఆలమూరులోని ఉన్నత పాఠశాల, బొబ్బా జయశ్రీ బాలికల జెడ్పీ హైస్కూల్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పదోతరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించి జిల్లాలో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈఓలు భమిడిపాటి అప్పాజీ, ఎస్‌వీ సుబ్బరాజును ఆదేశించారు.

ఘనంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలతోను, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు పీ రామశేషాచార్యులు ఈ కల్యాణం వైభవంగా నిర్వహించారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సాయం

మామిడికుదురు: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన గోగన్నమఠం పల్లిపాలానికి చెందిన బాధితులు పట్టా ఆదియ్య, పట్టా సురేంద్ర కుటుంబాలకు బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ సహాయం అందించింది.

సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల రెడ్‌క్రాస్ కార్యక్రమాల సమన్వయకర్త జంపన బుజ్జిరాజు చేతుల మీదుగా టార్పాలిన్, వంట సామగ్రి, రగ్గులు, బియ్యం, కూరగాయలు, చీరలు అందించారు. కార్యక్రమంలో సొసైటీ సహాయ కార్యదర్శి బోనం రాజు, సభ్యులు పాల్గొన్నారు.

స్వామి వారి సన్నిధిలో ఏపీఎస్‌ఆర్టీసీ ఎండీ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో బుధవారం ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు పలికి, స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం అందజేశారు.

ఎంపీటీసీకి మాజీ మంత్రి పరామర్శ


పెదబాబును పరామర్శిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి

మామిడికుదురు: అనారోగ్యంతో బాధపడుతున్న కొమరాడ ఎంపీటీసీ వలవల పెదబాబును రాజోలు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని అభిలాషించారు. ఆయనతో పాటు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, పార్టీ నేతలు సూరిశెట్టి బాబీ, కటకంశెట్టి ఆదిత్యకుమార్, కొల్లాబత్తుల వెంకటరమణ పెదబాబును పరామర్శించారు.

ప్రమాద బాధితురాలికి సాయం


బాధితురాలికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదవశాత్తూ కాలికి గాయం అయిన బాధితురాలికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు బుధవారం రూ.12 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కొత్తపేటకి చెందిన అంబటి సుజాత (37) పుట్టుకతోనే ఒక కాలు పోలియో. రెండు వారాల క్రితం ఇంట్లో పడిపోవడంతో పోలియో కాలు విరిగిపోయింది. ఆపరేషన్ చేయించారు. రెండు నెలలు మంచం మీదే ఉండాల్సిన పరిస్థితి. ఇంకా వైద్యానికి ఖర్చు పెట్టాలి. ఆమె భర్త సత్యకుమార్‌కి అంత ఆర్థికస్తోమత లేక స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో ఈ రోజు పేషెంట్ రావులపాలెంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి చూపించుకోవడానికి వచ్చినప్పుడు సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.12 వేలు సాయాన్ని అందజేశారు.

మెరుగైన సేవలు అందించేందుకు కృషి

పి.గన్నవరం: ధనవర్ష పరస్పర సహాయ సహకార పొదుపు సంఘ సభ్యులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని సంఘ చైర్మన్ కంకిపాటి ప్రసాద్ అన్నారు. సంఘ సభ్యుడైన తొత్తరమూడి బులి సత్యనారాయణ ఇటీవల మరణించగా, మంజూరైన రూ.లక్ష భీమా సొమ్మును అతడి కుటుంబ సభ్యులకు పి.గన్నవరంలోని సంఘ కార్యాలయంలో బుధవారం ప్రసాద్ అందజేశారు.

అంగన్‌వాడీలు బోధనాశక్తిని పెంచుకోవాలి

అంబాజీపేట: పిల్లల సమగ్ర అభివృద్ధి అంగన్‌వాడీ కార్యకర్తల కీలకపాత్ర వహించాలని ఐసీడీఎస్ సీడీపీఓ విజయశ్రీ అన్నారు. ముక్కామల జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న పోషన్ భీ-పఢాయి భీపై బ్యాచ్-2 అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండో విడత మూడో రోజు శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సీడీపీఓ విజయశ్రీ మాట్లాడుతూ 0-6 నెలల పిల్లల్లో సమగ్ర అభివృద్ధిని నిర్ధారించడానికి మహిళ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రూపొందించిన కార్యక్రమంలో నవచేతన, ఆదర్శ శీల, దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణలపై అంగన్‌వాడీలకు కేంద్ర ప్రభుత్వం శిక్షణ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వీఎస్‌వీ.మహాలక్ష్మి, వెన్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విలసలో..

అయినవిల్లి: మండలంలోని విలసలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ పడాయి బీ శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయగౌరి, జి.రామలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, అప్పుడే పుట్టిన చిన్నారుల దగ్గర నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారం ఇవ్వాలని, వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించాలన్నారు. మూడు రోజులు పాటు జరిగిన శిక్షణ తరగతుల్లో 74 మంది అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ముగిసిన కొత్తపూల ఉత్సవాలు

ఆలమూరు: మండలంలోని చింతలూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో గత పక్షం రోజుల నుంచి నిర్వహిస్తున్న కొత్తపూలు ఉత్సవాలు ముగిశాయి. కొత్తపూల ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రాత్రి రాజానగరం నుంచి వచ్చిన మహిళ గరగ కళాకారులు ప్రదర్శించిన నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే విచిత్ర వేషధారణలు, శక్తివేషాలు, తీన్‌మార్ వాయిద్యాలు అదనపు ఆకర్షణగా నిలిచాయి. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ కొత్తపూల ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించారు. మోదుగుపూలతో అలంకరించిన పెద్ద గరగకు అగరబత్తీలు, మల్లెపూల దండలు సమర్పించి తమభక్తిని చాటుకున్నారు. ఈనెల 27న సూర్యారావుపేటలో చిన జాగరణ నిర్వహించనుండగా చింతలూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో 28న పెద జాగరణ జరగనుంది. ఇప్పటికే విద్యుత్‌లంకరణ ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఉపాధి మేట్లకు శిక్షణ తరగతులు

పి.గన్నవరం: ఉపాధి హామీ పథకం పనులను సక్రమంగా, సమర్థవంతగా నిర్వహించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ జీవీకే మల్లికార్జునరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మండలంలోని మండలంలోని మేట్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేవీ ప్రసాద్, ఏపీడీ ట్రైనింగ్ కవిత, ప్లాంటేషన్ మేనేజర్ ఎం.త్రినాథ్, పి.గన్నవరం ఏపీఓ లక్ష్మీనారాయణ, ఎంసీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి


కార్తిక్ (ఫైల్)

మామిడికుదురు: బైక్ అదుపు తప్పి కొబ్బరిచెట్టును ఢీ కొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు అమలాపురం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు ఎక్కుతూ పెదపట్నంలంక గెద్దంవారిపేటకు చెందిన పల్లి కార్తిక్ (19) సోమవారం తీవ్రంగా గాయపడ్డాడు. మలికిపురం మండలం గొల్లపాలెంలోని తన సోదరి సృజన ఇంటికి వెళ్లి కార్తిక్ తిరిగి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన కార్తిక్‌ను అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబ సభ్యులు బుధవారం తెలిపారు. కార్తిక్ మృతితో అతని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుని కుటుంబ సభ్యుల నుంచి తమకు ఏ విధమైన ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

వేంకటేశ్వరునికి తామర పూలతో పూజ

రావులపాలెం: స్థానిక మార్కెట్ రోడ్డులో వేంచేసిన చిన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి సహస్ర తామర పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.


→ సహస్ర తామరపూలతో అలంకరించిన వేంకటేశ్వర స్వామి